క్లుప్తంగా

ఉద్యానపంటల సాగుకు ముందుకు రావాలి



మొక్కలు తీసుకెళ్తున్న రైతులు

సి.బెళగల్: రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావాలని సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్ తెలిపారు. శుక్రవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల రైతులకు మంజూరు అయిన మొక్కలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పండ్లు, పూల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 42 మంది రైతులకు 6,534 పండ్లు, పూల మొక్కలు మంజూరు అయ్యాయని ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్ తెలిపారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఓర్వకల్లు: కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డుల కోసం ఈ నెల చివరిలోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా కౌలు రైతులకు పంట నష్టపరిహారం, కనీస మద్దతుధర, పంటల బీమా తదితరాల వర్తిస్తాయన్నారు. అదేవిధంగా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు తీసుకోవచ్చన్నారు. కౌలురైతులు సమీప రైతు సేవా కేంద్రాలలో వీపీఏ/వీఆర్ఓను సంప్రదించాలని సూచించారు.

కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కులు విడుదల

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు శుక్రవారం 256 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ జేఈ రాజు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో లేదని, 0.954 టీఎంసీల నిల్వ ఉందని ఆయన తెలిపారు.

23నుంచి ఆధార్ నమోదు

కోడుమూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 27వతేదీ వరకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివ్య శుక్రవారం తెలిపారు. 23వతేదీ కోడుమూరు-2, పులకుర్తి-1, లద్దగిరి-1, ప్యాలకుర్తి-1 గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 24న కల్లపరి, కోడుమూరు-3, లద్దగిరి, అమడగుంట్ల గ్రామ సచివాలయాల్లో, 25న వర్కూరు-1, క్రిష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం, చిల్లబండ, వెంకటగిరి, 26న వర్కూరు-2, ముడుమలగుర్తి, గోరంట్ల-1, ప్యాలకుర్తి-2, 27న పులకుర్తి-2, కోడుమూరు-5, అనుగొండ, ఎర్రదొడ్డి గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం ఉంటుందని వివరించారు.

పాణ్యం: మండలంలో ఈనెల 23నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ శుక్రవారం తెలిపారు. ఈ నె 27వ తేదీ వరకు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ కౌలు కార్డులు



మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: పొలాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న అర్హులందరికీ కౌలు కార్డులు ఇస్తామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం బొల్లవరం గ్రామంలో కౌలు రైతులకు కౌలుకార్డు ప్రయోజనాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలు కార్డు ఉంటే రాయితీ విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అదేవిధంగా పెట్టుబడికి బ్యాంకు రుణాలు, పంట కొనుగోలు, ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. కౌలురైతులు వెంటనే కౌలుకార్డులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓ నాగమద్దయ్య, విస్తరణ అధికారి సువర్ణ, వీపీఏ చందన, రైతులు పాల్గొన్నారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి

కర్నూలు (లీగల్): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. ఆయన శుక్రవారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు హెల్మెట్ ధారణ, మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారుడితో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. ర్యాగింగ్ దుష్ప్రభావాల గురించి, విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిషేధానికి సంబంధించి శిక్షాపరమైన నిబంధనలు, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి విధించే శిక్షలు తదితర వాటిని వివరించారు. ర్యాగింగ్ వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.మనోహర్, ప్రిన్సిపాల్ శాంతి, డీన్ వై.శౌరియులు రెడ్డి, ట్రాఫిక్ సీఐ గౌతమి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



బీసీ కాలనీకి ఆనుకొని దిబ్బలా చెత్తకుప్ప



మంచి నీటి ట్యాంకు వద్ద అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చి మొక్కలు



గుట్టపాడులో రోడ్డుపై మురుగునీరు

‘మురుగు’తున్న పల్లెలు!

- అస్తవ్యస్థంగా మారిన పారిశుద్ధ్యం
- కంపుకొడుతున్న కాలనీలు
- పొంచివున్న సీజనల్ వ్యాధుల ముప్పు
- భయాందోళన చెందుతున్న గ్రామీణులు



పాత వడ్డెగేరి వద్ద నందికొట్కూరు రోడ్డులో సీసీ రోడ్డుపై మురుగు నీరు

ఓర్వకల్లు: పల్లెలు మురుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వర్షాకాలం...సీజన్ వ్యాధుల ముప్పు పొంచివుంది...అయినా ముందస్తు చర్యలు ఏ మాత్రం కనిపించడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయితీ కార్యదర్శుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఓర్వకల్లు మండలలో 23 గ్రామాలు ఉండగా ఎక్కువ పల్లెలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఇక ఉన్న మూడు మజరాల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయం అవుతున్నాయి. మురుగు నీరు రహదారిపై పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల దిగువ కాలనీలు కంపుకొడుతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించనందునే గ్రామాలు అస్తవ్యస్థంగా మారాయని ఆయా పల్లెల ప్రజలు వాపోతున్నారు. ఎస్సీ, బీసీ కాలనీలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ప్రత్యేకించి కన్నమడకల, గుట్టపాడు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, కాల్వ, కొమరోలు ప్రజలు నిత్యం మురుగునీటితో జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. కన్నమడకలలోని నూతన బీసీ కాలనీలో నిర్మించిన మురుగు కాల్వల్లో మురుగు పేరుకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. బీసీ కాలనీకి ఆనుకుని ఉన్న చెత్తకుప్పతో అపరిశుభ్రత నెలకొంది. మంచి నీటి ట్యాంక్ చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగినా ఎలాంటి చర్యలు లేవు. గుట్టపాడు గ్రామం పరిస్థితీ అంతే. దస్తగిరి స్వామి దర్గా ఎదుట వర్షపునీరు కాల్వను తలపిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఎక్కడ విషజ్వరాలు సోకుతాయోనని ఆయా పల్లెల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం ఓర్వకల్లులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజూ విషజ్వరాల పీడితులు పదిమందికి పైగానే వస్తున్నట్లు సిబ్బంది సమాచారం.

లొద్దిపల్లె అంగన్‌వాడీ కేంద్రం ఎదుటే మురుగునీరు

ప్రత్యేకించి లొద్దిపల్లెలో చిన్నారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఎదుటే మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చిన్నారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు చిన్నారులు అస్వస్థకు గురైనట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. అదేవిధంగా ఈ గ్రామంలోనే బీసీ బాలుర హాస్టల్ ఉంది. పారిశుద్ధ్యంలోపిండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులకు విషజ్వరాలు సోకినట్లు తెలుస్తుంది. అదేవిధంగా తాగునీరు శుభ్రంగా లేదని గ్రామస్తులు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లొద్దిపల్లెలో వర్షపునీటితో నిండిన ప్రధాన రహదారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కల్లూరు : మండల పరిధిలోని చిన్నటేకూరు, మిలిటరీ కాలనీ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్, కొత్త లైన్ పనులు జరుగుతున్నందున శనివారం వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న తెలిపారు. చిన్నటేకూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు, తడకనపల్లి, బస్తిపాడు, వామసముద్రం, బొల్లవరం, పుసులూరు, రేమడూరు, మిలటరీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని గార్గేయపురం, మిలటరీకాలనీ, నూతనపల్లి, నందనపల్లి, వెంకాయపల్లి, దిగువపాడు, పూడూరు గ్రామాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వెల్లడించారు. వ్యవసాయానికి త్రీఫేజ్ సప్లయ్ ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ ఆరోపించారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన 2401/2023, 2401/2023 డాక్యుమెంట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ల వ్యవహారాలను చూడాల్సిన జిల్లా రిజిస్ట్రార్ కూడా విచారణ జరపకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, గౌతమ్, హుస్సేన్‌బాష, శివశంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌కు శుక్రవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు, వర్సిటీ పరిధిలోని బీఈడీ, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల నాయకులు వీసీని కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని వైస్‌ఛాన్స్‌లర్ కోరారు.

కొత్త పశువైద్యశాలను నిర్మించండి



శిథిలమైన పశువైద్యశాలను పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కల్లూరు: శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాలను కూల్చి కొత్తది నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు మండలం జి. శింగవరం గ్రామంలో పశువైద్యశాలను డీవైఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ పశువైద్యశాల పూర్తిగా శిథిలవస్థలోకి చేరిందని, ప్రమాదాలు తెచ్చిపెట్టే నిలయంగా మారిందన్నారు. అక్కడ పని చేసే సిబ్బంది, పాడి రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ప్రకాష్, కిషన్, సురేష్, దస్తగిరి, బాషా తదితరులు పాల్గొన్నారు.



గడివేముల పాతబస్టాండ్ ప్రాంతంలో భారీవాహనాలతో ఏర్పడిన ట్రాఫిక్‌జామ్

నిత్యం ట్రాఫిక్ జామ్!

గడివేముల: మండల కేంద్రం గడివేములలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూనే ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రత్యేకించి జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన భారీ వాహనాలు గడివేముల మీదుగా వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. వాస్తవానికి భారీ వాహనాలకు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 వరకు మాత్రమే రాకపోకలు సాగించాల్సి ఉంది. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం మీదుగా కర్నూలుకు వెళ్లాల్సి ఉండగా మైలేజ్ కోసం గడివేముల మీదుగా భారీవాహనాలను నడుపుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో పాతబస్టాండ్ ప్రాంతంలో లారీల కిందపడి ఇద్దరు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలోకి భారీ వాహనాలు రాకపోకలు నియంత్రించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాల శుభ్రతపై సర్పంచ్‌తో చర్చిస్తున్న తహసీల్దార్ అనుపమ



ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ అనుపమ

సి.బెళగల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆ దిశగా సర్పంచ్‌లు ప్రజలను చైతన్య పరచాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ పర్యటించారు. సర్పంచ్ రామాంజనేయులుతో కలిసి వీధుల్లో పర్యటించిన ఆమె పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి, ఫ్రైడే డ్రైడేగా తప్పకుండా పాటించాలని ప్రజలకు సూచించారు. అనంతరం సర్పంచ్ అధ్యక్షతన స్థానిక గ్రామ సచివాలయంలో ఉద్యోగులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా తహసీల్దార్ అధికారులకు సూచించారు. మంచినీటిని చల్లార్చి తాగాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో డీటీ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వీఆర్వో పాండురంగన్న తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

మండల కేంద్రం సి.బెళగల్‌లోని కస్తూర్బా పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ అనుపమ తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించిన ఆమె నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా బాలికల డార్మెటరీ, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రత, విద్యార్థినీల ఆరోగ్య జాగ్రత్తలపై ఎస్‌ఓ జ్యోతితో తహసీల్దార్ చర్చించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమైన తహసీల్దార్ కొదిసేపు ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని శ్రద్ధగా చదవాలని విద్యార్థినులకు తహసీల్దార్ సూచించారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: విద్యార్థులకు ఆరోగ్యంపై శుక్రవారం ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పించారు. స్థానిక రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి, ఏఎన్ఎం అరుణకుమారి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలను వారు విద్యార్థులకు విశదీకరించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.

నెలాఖరులోపు పనులు పూర్తి చేయించండి

కర్నూలు (టౌన్): వచ్చే నెలలో ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించనుందని, నగరంలో అన్న క్యాంటీన్ల భవనాల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో, కల్లూరు ఎస్టేట్‌లోని సెట్కూర్ కార్యాలయం సమీపంలో, ఉల్చాల రోడ్డులోని వై.జంక్షన్ వద్ద ఉన్న పరిమళనగర్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, పాతబస్టాండ్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నెలాఖరులోపు పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎంఈ షాకీర్, డీఈ రవిప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కర్నూలు కల్చరల్: నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, టౌన్ మోడల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన ఉచిత నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన లెక్చరర్ల మార్గదర్శకత్వంలో అద్భుతమైన విజయాలు సాధించవచ్చన్నారు. త్వరలో మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ప్రవేశపెడతామన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాళ్లు జి.లాలప్ప, సుంకన్న మాట్లాడారు.

మల్లాపురంలో ఉచిత పశు వైద్య శిబిరం



మల్లాపురంలో గేదెకు టీకా వేస్తున్న డాక్టర్ మల్లన్న

గూడూరు రూరల్: మండల పరిధిలోని మల్లాపురంలో శక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శివకుమార్, జిల్లా పశుగణాభివృద్ధి సహాయ సంచాలకులు డాక్టర్ మల్లన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యులు పశువుకు టీకా వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువులకు ఉచితంగా మందులు, చికిత్సలు అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి గొడ్డుమోతు పశువులను గుర్తించి అవసరమైన చికిత్సలు అందిస్తున్నామన్నారు. రైతులు తమ పశువులకు గర్భకోశ చికిత్సలను చేయించి పాడి పశువులుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెంచికలపాడు పశువైద్యాధికారి సునీల్‌కుమార్, జేవీఓ మంజుల పాల్గొన్నారు.

భారీ వర్షం... వీధులు జలమయం



తేరుబజార్‌లో ప్రవహిస్తున్న వాననీరు



మునిమండలో భారీగా ప్రవహిస్తున్న వాననీరు

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరులో నెలరోజుల తర్వాత శుక్రవారం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం గంటకు పైగా వర్షం కురియడంతో పట్టణంలోని వీధులు జలమయం అయ్యాయి. మెయిన్ బజార్, తేరుబజార్, మునిమండ, మోమిన్ వీధుల్లో మోకాటి లోతుకుపైగా వాననీరు ప్రవహించడంతో జనజీవనం స్తంభించింది. జూన్ 1న ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవ్వగా అప్పట్లో వర్షాలు అనుకూలంగానే కురిశాయి. జూన్ 12వ తేదీన వర్షం కురిశాక వరుణుడు మొఖం చాటేశాడు. దీంతో ముంగారు పంటగా సాగు చేసిన కొర్ర రైతులు వరుణ కరుణ కోసం ఎదురు చూశారు. వర్షం కురువకపోవడంతో కొర్ర పూర్తిగా దెబ్బతింది. అయితే ఇప్పుడు కురిసిన వర్షంతో కంది, పత్తి పంటలకు మేలు చేకూరుతుందని రైతులు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



గూడూరులో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న యువకులు

గూడూరు రూరల్: పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గూడూరు పట్టణంలో యువకులు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన మృగాలను వెంటనే ఉరితీయాలని నినాదాలు చేశారు. అమ్మాయిలపై అత్యాచారాలు జరుకుండా ఉండాలంటే కఠినంగా వ్యవహరించాలని, ఉరిశిక్ష అమలు చేయాల్సిన అవసరం ఉందని యువకులు తెలిపారు.